కుర్ర వెధవకి మతి పోయింది, ఇదంతా చూస్తూంటే—

ఒక రోజు ఉదయం శుభలగ్నమందు కుర్ర వెధవ గుమ్మాలు తుడుస్తూంటే దాసీదాని చెయ్యి పట్టుకున్నాడు—

అది చీపురుకట్ట ఎత్తింది, పాముపడగ ఎత్తినట్టుగా!

---

# అబద్ధం!

శవాన్ని చూసి కొంతమంది బెదుర్తూంటారు-దాన్ని అపశకునంకింద భావిస్తారు-అది తమకు కీడు తీసుకు రాబోతూం దనుకుంటారు. ఇది శుద్ధ అబద్ధం!

నిజానికి, శవాన్ని చూసినవాళ్ళు సంతోషించాలి. ఎందుచేతనంటారా? చచ్చి పోయింది మీరు కాదు గనకనూ మరెవడో అభాగ్యుడు గనకనూ! మీరే చచ్చిపోయినట్లయితే మీకు ఎంత బాధగావుండునూ...? మీరు కాదు చచ్చిపోయింది-ఇంకొకడు. అతడి స్థానంలో మీరు లేక పోయినందుకు మీరు నిజంగా సంతోషించాలి-సంతోషించండి!

* * *

త్రాచుపాము మీ కాళ్ళముందరనుంచి ప్రాకుతూ పోయింది. మీ గుండెలు టపటప మంటూ తుపానుగాలిలో చిక్కిన గాలిపడగలా కొట్టుకుంటాయి. భయంతో మీ జుట్టు లేచి నించుంటుంది. మీకు కీడు జరిగిందను కోవడం అబద్ధం.

ఎందుచేత నంటారా?

అది మిమ్మల్ని కరవకుండా పోయింది గనక, అదే మిమ్మల్ని కరిస్తే...? వెళ్ళి, స్నేహితులకి టీపార్టీ చెయ్యండి?

* * *

ఒంటి బ్రాహ్మడు ఎదురుగా వస్తే మీరు ఎంత అర్జంటు ప్రయాణమైనా సరే మానేస్తారు. అది అపశకునం అంటారు. అతడి రాకవల్ల మీరు వెళ్ళబోయేపని చెడుతుందంటారు. ఇది అబద్ధం. మీరు వెళ్ళబోయేపని ఏమీ చెడదు. ఇది అపశకునం కాదు.

కాని, మీరు ఇలా ఎందుకు అనుకుంటారో మీకు తెలుసునా ?

హిందూమత సాంప్రదాయాల ప్రకారం బ్రాహ్మడు కనపడితే అతణ్ణి ఇంటికి తీసుకువెళ్ళి భోజనం పెట్టాలి. పదిమంది బ్రాహ్మలు కలిసి వస్తూంటే వారప్పుడే ఎక్కడో వారం ఏర్పరుచుకున్నారని మీకు తెలియకపోదు. అందుచేత ఎక్కువమంది బ్రాహ్మలు ఎదురైతే మీరు కీడుగా భావించరు. ఒక్కడు గనక ఎదురైతే అతడ్ని తీసుకువెళ్ళి భోజనం పెట్టాలనే భావం మీ కళ్ళకు ఒక గొప్ప కీడుగా, అపశకునంగా, మీరు వెళ్ళేపనిని చెరపడానికి వచ్చినవానిలా కనిపిస్తూంది!

* * *

వితంతువు ఎదురుగా రావడంకూడా రమారమీ ఇలాంటిదే. వితంతువుకు భర్తవుండడు. కాగా, ఆమెకు ఇతరుల సహాయం అవసరముంటుంది-మిమ్మల్నే ఆ సహాయమేదో చెయ్యమంటుం దేమోనని మీరు ఢడిసిపోయి ఆమె ఎదురుగా వస్తూంటే అపశకునమనుకుని ఇంట్లోకి పోయి దాక్కుంటారు !